బిల్లులు రావు..

భవనాలు పూర్తికావు!



మెట్‌పల్లి మండలం కేసీఆర్ తండాలో నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవనమిది. తలుపుల బిగింపు, ఫ్లోరింగ్, రంగులు వేయడం తదితర పనులు మిగిలిపోయాయి. బిల్లులు రాక పోవడంతో పనులు ముందుకు సాగడం లేదని తెలుస్తోంది. నూతనంగా ఏర్పడ్డ గ్రామ పంచాయతీ కార్యాలయం గతంలో పాఠశాల భవనంలో కొనసాగగా ప్రస్తుతం మహిళా సంఘం భవనంలోని ఓ గదిలో నిర్వహిస్తున్నారు. సమావేశాల నిర్వహణ, రికార్డులు భద్రపర్చడానికి అటు అధికారులు ఇటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

గ్రామ పంచాయతీల్లో పాలనకు ఇబ్బందులు

న్యూస్‌టుడే, మెట్‌పల్లి

పనులు మొదలుకానివి 24
జిల్లాలో మొత్తం పంచాయతీలు 380
కొత్తగా మంజూరైన భవనాలు : 191
సొంత భవనాలున్నవి 189
పూర్తయినవి 39
కొత్తగా ఏర్పడినవి 60
ప్రగతిలో ఉన్నవి : 127

పాలనకు కీలకమైన గ్రామ పంచాయతీ కార్యాలయాలకు సొంత భవనాలు కరవయ్యాయి. సమస్యల పరిష్కారం, సమావేశాలు, రికార్డుల నిర్వహణ, అభివృద్ధి పనులు ఇలా అన్నీ ఇక్కడి నుంచే నిర్వహించాల్సి ఉంటుంది. పాలనకు కీలకమైన గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు నిధులు మంజూరైనా పలుచోట్ల పనులు ముందుకు సాగడం లేదు. చేసిన పనులకు సకాలంలో బిల్లులు రాకపోవడంతో వేగం తగ్గింది. మరికొన్ని చోట్ల ఇతర కారణాలతో పనులు మొదలవలేదు.

జిల్లాలో కొత్త పంచాయతీలతో పాటు భవనాలు శిథిలావస్థకు చేరిన చోట పాలనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అద్దె, కమ్యూనిటీ, పాఠశాల, మహిళా సంఘాల భవనాల్లో కొనసాగుతుండటంతో గ్రామసభలు, సమావేశాల నిర్వహణ, రికార్డులు భద్రపర్చడం కష్టంగా మారింది. సుమారు రెండేళ్ల కిందట కొత్త పంచాయతీలతో పాటు భవనాలు శిథిలావస్థకు చేరిన గ్రామాల్లో నూతన పంచాయతీ భవనాల నిర్మాణాలకు దశల వారీగా నిధులు మంజూరయ్యాయి. ఒక్కో భవనానికి రూ.20 లక్షల నిధులను మంజూరు చేశారు. పనులు మొదలై కొన్ని చోట్ల పూర్తయ్యాయి. చాలా చోట్ల పనులను అసంపూర్తిగా వదిలేశారు. సకాలంలో బిల్లులు రావడం లేదని, వడ్డీకి డబ్బులు తెచ్చి భవనాలు నిర్మించామని గుత్తేదారులు వాపోతున్నారు. బిల్లులు ఎప్పుడు మంజూరవుతాయో నన్న అనుమానంతో పనులు చేయడానికి విముఖత చూపుతున్నారు. కొన్ని పంచాయతీ భవనాలు స్థల సమస్య, ఇతర కారణాలతో నేటికి పనులు ప్రారంభం కాలేదు.

వడ్డీ కట్టలేక ఇబ్బందులు



కొత్తగా పంచాయతీ ఏర్పడడంతో నూతన భవనానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయి. దీంతో పనులు ప్రారంభించి పూర్తి చేశాను. ఏడాదిన్నర కిందట నూతన పంచాయతీ కార్యాలయంలో కార్యకలాపాలు మొదలయ్యాయి. సుమారు రూ.22 లక్షలు ఖర్చు పెట్టాను. రూ.13 లక్షలు మాత్రమే బిల్లులు వచ్చాయి. నిర్మాణ పనులకు తెచ్చిన అప్పుకు వడ్డీ కట్టలేక ఇబ్బందులు పడుతున్నాను. చేసిన పనులకు బిల్లులు త్వరగా మంజూరు చేయాలి.

- ఆకుల రాజరెడ్డి, విట్టంపేట మాజీ సర్పంచి



కొండ్రికర్లలో ప్రారంభం కాని పనులు

మోక్షం కలిగేనా..

మెట్‌పల్లి మండలంలో 11 పంచాయతీలకు గాను నాలుగు పంచాయతీల భవనాలు పూర్తయ్యాయి. రెండు చోట్ల ప్లాస్టరింగ్, మరో రెండు స్లాబు దశలో ఉన్నాయి. కోనరావుపేట, కొండ్రికర్లలో పనులు ప్రారంభం కాలేదు. చెర్లకొండాపూర్‌లో స్థల సమస్య ఏర్పడింది. బిల్లులు రాకపోవడంతో పనుల్లో కదలిక లేదు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. ఇటీవల పంచాయతీరాజ్‌శాఖ పెండింగ్ బిల్లుల వివరాలు ప్రభుత్వానికి పంపించినట్లు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణ పనులు ప్రారంభించగా, ఈ ప్రభుత్వ హయాంలో బిల్లులు మంజూరై పనులు పూర్తవుతాయా? లేదా? అని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

నేడు బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు

జగిత్యాల క్రీడావిభాగం: జగిత్యాల పట్టణంలోని శ్రీవివేకానంద మినీస్టేడియంలో గురువారం సాయంత్రం 5 గంటలకు మహిళలు, పురుషులకు బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి, డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు.

సీఎంఆర్ చెల్లింపుల్లో వెనుకంజ

జిల్లాలో ధాన్యం సేకరణకు అడ్డుగా మారే అవకాశం!

న్యూస్‌టుడే, జగిత్యాల ధరూర్‌క్యాంపు



జగిత్యాల మండలంలో వరిపైరు నూర్పిడి

బాయిల్డ్, రారైస్ మిల్లుల నుంచి గడువులోగా బియ్యం వెనక్కి వస్తేనే గోదాముల్లో నిల్వచేయటం, భారత ఆహార సంస్థకు కేటాయింపు, ఇతర రాష్ట్రాలకు ప్రత్యేక రైళ్ల ద్వారా తరలింపు సాధ్యపడుతుంది. మరోవైపు మిల్లులు, గోదాములు, నిల్వకేంద్రాల్లోని ధాన్యాన్ని మరాడించి తరలిస్తేనే ప్రస్తుత వానాకాలం పంటను సజావుగా కొనుగోలు చేసే వీలుంటుంది. కానీ ఇప్పటికీ జిల్లాలో గత సీజన్లకు చెందిన 80 వేల మెట్రిక్ టన్నుల కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) రావాల్సి ఉండగా సెప్టెంబరు నెలాఖరుతోనే గడువు ముగిసింది. ఈ నెలాఖరు వరకు సీఎంఆర్ గడువును పొడిగిస్తారన్నా ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది.

నూతన నిబంధన

సకాలంలో కనీసమోతాదు మేరకు సీఎంఆర్ ఇచ్చిన మిల్లులకే వడ్లు ఇవ్వాలని, ఈ సీజన్ నుంచి మిల్లులకు కేటాయించే ధాన్యంలో కనీసం 25 శాతం బ్యాంకు గ్యారంటీని ఇస్తేనే సదరు మిల్లుకు ధాన్యాన్ని కేటాయించాలని రాష్ట్రప్రభుత్వం యోచిస్తోంది. గత సీజన్లలో ప్రభుత్వమిచ్చిన వడ్లను మరాడించి బియ్యాన్ని ప్రైవేటుగా విక్రయించి సీఎంఆర్ ఇవ్వకపోవటం, రైతుల నుంచి నేరుగా వడ్లను లేదా పీడీఎస్ బియ్యాన్ని కొని ప్రభుత్వానికి లెవీ ఇస్తున్నారనే ఆరోపణలతో ప్రభుత్వం ఈ సీజన్ నుంచి నిబంధనలను మరింత కఠినతరం చేస్తోంది. సీఎంఆర్ ఇవ్వని మిల్లులను బ్లాక్‌లిస్ట్‌లో ఉంచి ధాన్యాన్ని ఇవ్వబోమని,

జిల్లాలో ఇవ్వాల్సిన సీఎంఆర్ 3.0 లక్షల మెట్రిక్ టన్నులు | ఇప్పటివరకు ఇచ్చినది 2.20 లక్షల మెట్రిక్ టన్నులు | ఇంకా ఇవ్వాల్సింది 80 వేల మెట్రిక్ టన్నులు

ఆ మిల్లులకు ఇవ్వకుంటే..

సీఎంఆర్ పూర్తిగా ఇవ్వని మిల్లులకు కేటాయింపులు చేయకుంటే ధాన్యం సేకరణ అవకాశాలు తగ్గుతాయి. సీఎంఆర్ సేకరణ జాప్యాన్ని తీవ్రంగా పరిగణించి రాష్ట్ర పౌరసరఫరాలశాఖ, భారత ఆహారసంస్థ అధికారులు కస్టమ్ మిల్లింగ్ వేగవంతం చేయటంపై దృష్టిసారించారు. జిల్లాలో ఈ వానాకాలంలో రికార్డుస్థాయిలో 3.16 లక్షల ఎకరాల్లో వరి పంటను సాగుచేయగా ఇందులో 86 వేల ఎకరాల సన్నగింజ రకాలున్నాయి. ప్రభుత్వం ఈ సీజన్‌లో క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్‌ను చెల్లించి సన్నగింజ రకాలను కొనుగోలు చేస్తామన్నా ఇంత వరకు మార్గదర్శకాలను జారీచేయలేదు. జిల్లాలో వరినూర్పిడులు ప్రారంభంకాగా 420కి పైగా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దొడ్డుగింజ రకాలతో పాటుగా తొలిసారిగా సన్నగింజ రకాలను వేరువేరుగా కొనుగోలు చేయనున్నారు. సీఎంఆర్‌తో కొనుగోళ్లకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోనున్నట్లు సివిల్ సప్లయిస్ జిల్లా అధికారి జితేందర్‌రెడ్డి తెలిపారు.

అవసరమైతే కేసులు నమోదు చేస్తామని ప్రభుత్వం పేర్కొన్నా ఈ అంశాలు ధాన్యం సేకరణకు అడ్డుకాకుండా చూడాల్సి ఉంది.



కౌంటర్ వద్ద అభ్యర్థులు



పిల్లలతో అభ్యర్థుల కుటుంబసభ్యులు

డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

జగిత్యాల, న్యూస్‌టుడే: జిల్లాలోని డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన బుధవారం మధ్యాహ్నం ప్రారంభమైంది. ధరూర్‌క్యాంపు టీచర్ భవన్‌లో పత్రాల పరిశీలన కోసం 11 కౌంటర్లు ఏర్పాటు చేశారు. జిల్లా విద్యాధికారి డాక్టర్ బి.జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపిక చేసిన ఉపాధ్యాయులు మెరిట్ జాబితా ప్రకారం అభ్యర్థుల ఒరిజినల్ ధ్రువపత్రాలను పరిశీలించి గెజిటెడ్ అధికారులు ధ్రువీకరించిన జిరాక్స్ ప్రతులను తీసుకున్నారు. తొలిరోజు ఎస్జీటీ అభ్యర్థుల పరిశీలన జరిగింది. సాయంత్రం 6 గంటల వరకు సుమారు 200 మంది అభ్యర్థుల పత్రాలను పరిశీలించారు. మహిళా అభ్యర్థులు ఎక్కువ మంది రాగా వారి పిల్లలన్ని భర్తలు, బంధువులు ఎత్తుకొని ఆరుబయట ఆడించారు. గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ పత్రాల పరిశీలన జరుగుతుందని అధికారులు తెలిపారు.

ఎంగిలిపూల బతుకమ్మ

తీరొక్క పూలతో పేర్చి ప్రకృతిని ఆరాధిస్తూ ఆనందోత్సహాల మధ్య సాగే బతుకమ్మ పండగ బుధవారం ప్రారంభమైంది. జిల్లాలో తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ వేడుకల్లో మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పట్టణాలు, పల్లెలు తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ ఆడి పాడారు. **- న్యూస్‌టుడే, జగిత్యాల**



జగిత్యాల ధర్మశాల వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

వంట నూనెలు సలసల

- పక్షం రోజుల్లో లీటరుకు రూ.20కు పైగా పెంపు
- ఉమ్మడి జిల్లాపై రూ.6.80 కోట్ల భారం



న్యూస్‌టుడే, పెద్దపల్లి

దసరా పండుగ వేళ వంట నూనెల ధరలు పెరగడం మధ్యతరగతి కుటుంబాలకు శరాఘాతంగా మారింది. దిగుమతులపై ప్రభుత్వం సుంకం పెంచిన నేపథ్యంలో కంపెనీలు ధరలను గణనీయంగా పెంచేశాయి. పదిహేను రోజుల వ్యవధిలో ఒక్కో కంపెనీ ఒక్కో రకంగా పెంచడంతో లీటరు నూనెపై రూ.20-30 వరకు భారం పడింది.

పదిహేను రోజుల్లోనే పైపైకి

వంట నూనెల దిగుమతి సుంకాన్ని 20 శాతం పెంచుతూ కేంద్ర ప్రభుత్వం సెప్టెంబరు 13న నిర్ణయం తీసుకుంది. దీంతో రష్యా, ఉక్రెయిన్ యుద్ధం మొదలైన రోజుల మాదిరిగా ధరలు పరుగులు తీశాయి. పక్షం రోజుల వ్యవధిలోనే లీటరు ధర పొద్దుతిరుగుడు రూ.130కు, పామోలిన్ రూ.125కు చేరింది. గత నెల 13వ తేదీతో పోలిస్తే ఒక్కో లీటరుపై రూ.20 వరకు పెరిగింది. కొద్ది రోజుల్లో మరో రూ.5 వరకు పెరిగే అవకాశముంది. ఈ ధరల పోటీలో ఒకటి రెండు ప్రముఖ కంపెనీలు సంయమనం పాటించగా మిగతా కంపెనీలు మాత్రం పరుగులు పెట్టిస్తున్నాయి.

దేశీ ఉత్పత్తులపైనా..

దేశీయంగా తయారయ్యే సోయాబీన్, వేరుశనగ, రైస్‌బ్రాన్ తదితర నూనెల ధరలు కూడ విదేశీ ఉత్పత్తులతో సమానంగా పెంచేశారు. సెప్టెంబరు 10 వరకు లీటరు రైస్‌బ్రాన్ నూనె ప్యాకెట్ రిటైల్ ధర రూ.120 వరకుండగా ప్రస్తుతం రూ.135కు పెరిగింది. పల్లి నూనె ధర రూ.150 నుంచి రూ.160కి పెంచేశారు. కొన్ని కంపెనీలు మాత్రం ధరల పెరుగుదల తీవ్రత తెలియొద్దనే ఉద్దేశంతో పరిమాణాన్ని తగ్గించి విక్రయిస్తున్నాయి. దిగుమతి సుంకం పరిధిలోకి రాని దేశీయ నూనెల ధరలను సైతం పెంచడంతో సామాన్యులకు భారంగా మారింది.

అత్యధికంగా పొద్దుతిరుగుడు

ఉమ్మడి జిల్లాలో గృహ, వాణిజ్య అవసరాల కోసం ప్రతి నెలా 3400 మెట్రిక్ టన్నుల వంట నూనె వినియోగం జరుగుతోంది. ఇందులో అత్యధికంగా పొద్దుతిరుగుడు 2040 మెట్రిక్ టన్నులు, పామోలిన్ 840 మెట్రిక్ టన్నులు, వేరుశనగ, తవుడు, ఇతర నూనెలు 520 మెట్రిక్ టన్నులుంటాయి. సెప్టెంబరు 10 వరకు ఒక నెలకు సరిపడా నూనె కొనుగోలు చేసేందుకు వినియోగదారులు రూ.37.40 కోట్లు వెచ్చించగా, ప్రస్తుతం రూ.44.20 కోట్లు వెచ్చించాల్సి ఉంటుంది. సగటు ధర ఆధారంగా లెక్కించిన గణాంకాలే ఇవి. రోజువారీగా మారుతున్న ధరలను పరిగణనలోకి తీసుకుంటే భారం మరింత ఎక్కువగా ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో నూనెల వాడకం, పెరిగిన ధరల ప్రభావం

నూనె రకం	పరిమాణం (మెట్రిక్ టన్నుల్లో)	గతంలో వెచ్చించిన మొత్తం (రూ.కోట్లలో)	పెరిగిన భారం (రూ.కోట్లలో)
పొద్దుతిరుగుడు	2040	27.54	4.08
పామోలిన్	840	10.08	1.68
వేరుశనగ, రైస్‌బ్రాన్ తదితరాలు	520	7.80	1.04

పక్కాగా సర్వే

జగిత్యాల, న్యూస్‌టుడే: డిజిటల్ కార్డుల కోసం పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన వార్డులు, గ్రామాల్లో పక్కాగా సర్వే చేయాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులు, సంబంధిత బృందాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన ప్రకారం ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించాలని ఎలాంటి అపోహలకు అవకాశం ఇవ్వరాదన్నారు. అధికారులు ఆయా వార్డులు, గ్రామాల్లో క్షేత్రస్థాయిలో సందర్శించాలని నిర్దేశించిన గడువులోపు పూర్తిస్థాయిలో వివరాలు సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు. అదనపు కలెక్టర్లు పి.రాంబాబు, బి.గౌతంరెడ్డి, ఆర్డీవోలు పి.మధుసూదన్, ఎన్.శ్రీనివాస్, డీపీవో ఎం.రఘువరన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దేవీ శరన్నవరాత్రులు

జగిత్యాల విద్యానగర్, న్యూస్‌టుడే: జిల్లాలో గురువారం నుంచి దేవీశరన్నవరాత్రులు ప్రారంభం కానున్నాయి. దుర్గామాత విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు సేవా సమితులు, భక్త బృందాలు, కుల సంఘాలు, యువజన మండళ్ల ఆధ్వర్యంలో మంటపాలు ముస్తాబు చేశారు. అమ్మవారి విగ్రహాలను వాహనాల్లో మంటపాల వద్దకు తరలించారు. జగిత్యాల పట్టణంలో ఆనవాయితీగా నవదుర్గా, కనకదుర్గ, జయదుర్గ, సువర్ణ దుర్గ సేవా సమితులు, భక్త బృందాల ఆధ్వర్యంలో మంటపాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.



ముస్తాబైన కనకదుర్గ సేవా సమితి మంటపం

పకడ్బందీగా డిజిటల్ కార్డులు

సన్నాహక సర్వేకు రంగం సిద్ధం

ఈనాడు, కరీంనగర్



కుటుంబ డిజిటల్ కార్డుల జారీకి రంగం సిద్ధమైంది.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇంటిల్లిపాది సమాచారాన్ని ఒకేచోట క్రోడీకరించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. గురువారం నుంచి ఉమ్మడి జిల్లాలోని ఎంపిక చేసిన పల్లెలు, వార్డులకు అధికారులు, సిబ్బంది వెళ్లి కుటుంబంలోని మహిళ పేరుతో జారీ చేసే కొత్త డిజిటల్ కార్డుకు అవసరమైన సమాచారాన్ని సేకరించనున్నారు. ఇప్పటికే రాష్ట్రస్థాయి అధికారులు అందించిన మార్గదర్శకాల ప్రకారం నాలుగు జిల్లాల పరిధిలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 24 ప్రదేశాల్ని ఎంపిక చేశారు. నియోజకవర్గ కేంద్రంలోని ఒక వార్డుతోపాటు ఆ నియోజకవర్గ పరిధిలోని ఒక గ్రామాన్ని సన్నాహక సర్వే (పైలట్ ప్రాజెక్ట్)కు ఎంచుకున్నారు. ఈ నెల 7వ తేదీ వరకు రోజూ నివాస గృహాల వారీగా పూర్తిస్థాయి వివరాలు తెలుసుకోనున్నారు. నియోజకవర్గానికి ఆర్డీవో లేదా జిల్లాస్థాయి ఉన్నతాధికారిని నోడల్ అధికారిగా నియమించారు. వీరి పర్యవేక్షణలో ప్రతి గ్రామానికి బృంద నాయకుడిగా ఎంపీడీవో, సభ్యులుగా ఇతర అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్ల సేవల్ని వినియోగించుకునే ఏర్పాట్లు చేశారు.

ప్రక్రియ తీరిలా..!

- ఉమ్మడి జిల్లాలో 5,359 ఇళ్లకు సన్నాహక సర్వేలో భాగంగా ఈ డిజిటల్ కార్డుని అందించనున్నారు. ఈ కుటుంబాల్లో ఉన్న సుమారు 16వేల మందికి పైగా సభ్యుల పూర్తి వివరాలు తెలుసుకుని ఆన్‌లైన్‌లో పొందుపర్చనున్నారు.
- సర్వేలో భాగంగా ఇంటి యజమానురాలితోపాటు సభ్యులకు సంబంధించిన వివరాల్ని తప్పులు లేకుండా నమోదు చేస్తారు. వారికి ఉన్న ఆరోగ్యకార్డులు ఇతర వివరాల్ని నమూనా పత్రంలో పొందుపరుస్తారు.
- ముఖ్యంగా రేషన్‌కార్డు సంఖ్య సహా ఆరోగ్య సమాచారాన్ని సమగ్రంగా తీసుకోనున్నారు.

పింఛన్ లబ్ధిదారు, స్వయం సహాయక సంఘం సభ్యులు, రైతు భరోసా, రుణమాఫీ, ఆరోగ్యశ్రీ ఇలా అన్నింటి వివరాలు సేకరిస్తారు.

- కుటుంబ సభ్యులు సమ్మతిస్తేనే వారి అందరి ఫొటోను తీసుకుంటారు.
- అన్ని వివరాల సేకరణ తరువాత ఈ డిజిటల్ కార్డుపై ప్రత్యేకమైన నంబరును కేటాయించనున్నారు.
- 200ల లోపు కుటుంబాలు ఉన్న గ్రామాలు, 500ల ఇళ్లలోపు ఉన్న వార్డులను మాత్రమే ప్రస్తుతం ఎంపిక చేశారు.
- కలెక్టర్లు ఈ అయిదు రోజులు ప్రత్యేక పరిశీలన చేపట్టనున్నారు.
- వివరాలెలా సేకరించాలనే విషయమై సిబ్బందికి ప్రత్యేకంగా తర్ఫీదునిచ్చారు. ఎక్కడా తప్పులకు ఆస్కారం లేకుండా పలు అంశాల్ని పొందుపరుస్తారు. సవరణలకు అవకాశాన్ని కల్పించనున్నారు.

ఎంపికైన వార్డులు, గ్రామాలు

పట్టణం	వార్డు	కుటుంబాలు	గ్రామం/మండలం	కుటుంబాలు
రామగుండం	48	782	గుడిపల్లె (పాలకుర్తి)	157
మంథని	13	220	ధరియాపూర్ (ముత్తారం)	108
పెద్దపల్లి	24	288	దుబ్బపల్లి (సుల్తానాబాద్)	145
సిరిసిల్ల	25	350	రామోజీపేట (ఇల్లంతకుంట)	170
వేములవాడ	19	162	బొల్లారం (వేములవాడ గ్రామీణం)	162
కోరుట్ల	18	321	సర్ఫరాజ్‌పల్లి (కోరుట్ల)	150
జగిత్యాల	9	200	వడ్డెర కాలనీ (జగిత్యాల గ్రామీణం)	159
ధర్మపురి	4	264	అబ్బాపూర్ (గొల్లపల్లి)	180
కరీంనగర్(కొత్తపల్లి)	12	232	తాహెర్ కొండాపూర్ (కరీంనగర్ గ్రామీణం)	140
చొప్పదండి	7	235	కోనేరుపల్లి (చొప్పదండి)	180
హుజూరాబాద్	12	279	పాపాయపల్లి (జమ్మికుంట)	165
మానకొండూర్	-	-	నేదునూరు (తిమ్మాపూర్)	139
			అర్కండ్ల(శంకరపట్నం)	171



కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

మహాత్మా గాంధీ అందరికీ ఆదర్శం

జగిత్యాల, న్యూస్‌టుడే: జాతిపిత మహాత్మాగాంధీ అందరికీ ఆదర్శమని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన పోరాట ఫలితమే దేశానికి స్వాతంత్ర్యమని యువత ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. అదనపు కలెక్టర్ పి.రాంబాబు, బీసీ, ఎస్సీ అభివృద్ధి అధికారులు ఎల్.సాయిబాబా, కె.రాజ్‌కుమార్, డీపీవో ఎం.రఘువరన్, జిల్లా సంక్షేమాధికారి డాక్టర్ బి.నరేష్, పర్యవేక్షకులు షాదాబ్ హకీం, విశ్వంబర్, మెప్మా ఏవో శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


■ మహాత్మాగాంధీ అహింసతోనే స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయుడని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీఎస్పీ రవీంద్రకుమార్, రంగారెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ ఆరిఫ్‌అలీఖాన్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ రామక్రిష్ణ, వేణు తదితరులు పాల్గొన్నారు.

■ మహాత్మాగాంధీని యువత ఆదర్శంగా తీసుకోవాలని శాసనమండలి సభ్యుడు టి.జీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం జగిత్యాల పురాణిపేట తదితర ప్రాంతాల్లో గాంధీ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. పురపాలక ఛైర్‌పర్సన్ జ్యోతి, మాజీ ఛైర్‌పర్సన్ టి.విజయలక్ష్మి, కమిషనర్ సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీ కార్యాలయంలో..

జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక



చరితార్థ్

కోరుట్ల, న్యూస్‌టుడే: కథలాపూర్ మండల కేంద్రానికి చెందిన పులికాంత చరితార్థ్(10వ తరగతి) జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. చరితార్థ్ అండర్-18 విభాగంలో జిల్లా, రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో పాల్గొని చక్కని ప్రతిభ కనబర్చాడు. అక్టోబర్ మొదటి వారంలో పంజాబ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు.

మేమున్నాం.. మీకు తోడుగా...
(10 AM TO 1 PM)
జగిత్యాల 94400 23123
కోరుట్ల 9491324656 ధర్మపురి 94403 88638

న్యూస్‌టుడే, రాయికల్

సమస్య: మండలంలోని బోర్నపల్లి రహదారిలోని రామాజిపేట కల్వర్టు మరమ్మతు చేపట్టాలి. - **రాకేష్, రాయికల్**

సమాధానం: లోతట్టు వంతెనల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు విడుదల కాగానే చేపడతాం.

- ప్రసాద్, ఏఈ పంచాయతీరాజ్


శాస్త్రి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: మెట్‌పల్లిలో మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జువ్వాడి నర్సింగరావు, శాస్త్రి యువజన సంఘం సభ్యులు తదితరులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. జై జవాన్-జై కిసాన్ నినాదంతో జాతిని జాగృతం చేసిన మహనీయుడని కొనియాడారు.

మెట్‌పల్లి పట్టణం: లాల్ బహదూర్‌శాస్త్రి జయంతి కార్యక్రమాన్ని మెట్‌పల్లిలో ఘనంగా నిర్వహించారు. పాతబస్టాండ్ వద్ద గల శాస్త్రి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే, ఖాదీ బోర్డు ఛైర్మన్ కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఇల్లెందుల శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాకేష్, వేణు, నర్సింలు, శివకుమార్, శ్రీనివాస్, రాజేశ్వర్‌గౌడ్, ఆంజనేయులు, తుకారాం, భాస్కర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముడి జీవిత చరిత్రను పిల్లలకు వివరించండి


దారం వడుకుతున్న ఎమ్మెల్యే డా.సంజయ్

మెట్‌పల్లి పట్టణం, న్యూస్‌టుడే: పిల్లలకు మహాత్మాగాంధీ జీవిత చరిత్రపై అవగాహన కల్పించాలని, ఖాదీ వస్త్రాలను అందరూ ధరించి మహాత్ముని ఆశయ సాధనకు కృషి చేయాలని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా ఖాదీలో ఏర్పాటు చేసిన అఖండసూత్ర యజ్ఞాన్ని ఖాదీ బోర్డు ఛైర్మన్ కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కార్మికులతో కలిసి రాట్నంతో దారంవడికారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు రాట్నంతో వడికిన దారంను దండగా మార్చి మహాత్ముని మెడలో వేసి ఖాదీ ఉద్యోగులు నివాళులు అర్పించారు. మేనేజర్ గుర్రాల మాధవ్, పుర ఛైర్‌పర్సన్ రాణవేని సుజాత, వైస్‌ఛైర్మన్ చంద్రశేఖర్‌రావు, ఖాదీ న్యాయసలహాదారుడు మగ్గిడి వెంకటనర్సయ్య, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక


కోరుట్ల, మెట్‌పల్లి క్రీడాకారులు

కోరుట్ల, న్యూస్‌టుడే: కరీంనగర్‌లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ తైక్వాండో టోర్నమెంట్‌లో కోరుట్ల, మెట్‌పల్లికి చెందిన 15 మంది మాస్టర్ తైక్వాండో క్లబ్ క్రీడాకారులు పాల్గొని సత్తాచాటారు. ఆరు బంగారు, అయిదు రజత పతకాలను కైవసం చేసుకున్నారు. ఈనెల 17న ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధించినట్లు శిక్షకుడు రమేశ్ తెలిపారు. వీరిని జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు గంగరావు అభినందించారు.

నారసింహుడి సన్నిధిలో జడ్జి పూజలు

ధర్మపురి : పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బుధవారం నిర్మల్ జిల్లా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి అజయ్‌కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సీనియర్ అసిస్టెంటు అల్వాల శ్రీనివాస్ స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని జడ్జికి అందజేశారు. దేవస్థానానికి బుధవారం రూ.1,02,748 ఆదాయం సమకూరినట్లు ఈవో శ్రీనివాస్ తెలిపారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

ధర్మపురి: పట్టణంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ క్రమంలో శ్రీ రామలింగేశ్వరాలయాన్ని ఆలయ అధికారులు ముస్తాబు చేశారు. నేటినుంచి నుంచి ఈనెల 12 వరకు శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు.

ఆవాసం నిర్మాణానికి విరాళం

జగిత్యాల విద్యానగర్: జగిత్యాల పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీలో చేపట్టిన శ్రీవాల్మీకి ఆవాసం నిర్మాణానికి గొల్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు, డాక్టర్ చంద్రశేఖర్‌గౌడ్ బుధవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. నిర్వాహకులు అశోక్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

కోరుట్ల, న్యూస్‌టుడే: కోరుట్ల పురపాలక సంఘంలో ఉత్తమ పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్మికులు విధి నిర్వహణలో ఉత్తమ సేవలందిన కిరణ్‌కుమార్, నరేశ్, బుచ్చమ్మ, భాగ్య, కనకతారను సన్మానించి ప్రశంసా పత్రాలను అందజేశారు.


రాయికల్ పట్టణంలో..


జగిత్యాల పాలాస పరిశోధనస్థానంలో..


మల్యాల: సోనియా గాంధీ గుడి ముందు


మేడిపల్లిలో..

గాంధీకి ఘన నివాళి

మహాత్మా గాంధీ జయంతి వేడుకలను బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే యంత్రాంగం


మెట్‌పల్లిలో..


మెట్‌పల్లిలో..


మల్లాపూర్‌లో..


ధర్మపురిలో ఆర్యవైశ్యులు, ప్రజాప్రతినిధులు


బుగ్గారం మండల కేంద్రంలో..


ఇబ్రహీంపట్నంలో ..


కొడిమ్యాలలో..


జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్


పెగడపల్లిలో..


కోరుట్లలో..


గొల్లపల్లి మార్కెట్ యార్డులో..


సారంగాపూర్: పెంబట్లలో..


రాయికల్: అల్లీపూర్‌లో..

బతుకమ్మ సంబరాలు


మెట్‌పల్లిలో..


కోరుట్ల ఆర్యవైశ్య సంఘంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: మెట్‌పల్లి పట్టణంలోని శ్రీవిజయసాయి సెంట్రల్ హైస్కూల్‌లో బుధవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రంగు రంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి పాటలు, కోలాటంతో ఉత్సాహంగా ఆడిపాడారు. అనంతరం నిమజ్జనం చేశారు. కరస్పాండెంట్ పుల్ల ప్రదీప్‌గౌడ్, డైరెక్టర్ శ్రీరామ్‌భూపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.


ధర్మపురిలోని బ్రహ్మపుష్కరిణిలో..

కొడిమ్యాల: కొడిమ్యాల మండలంలో బతుకమ్మ వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మహిళలు, యువతులు, చిన్నారులు రంగురంగుల పూలను సేకరించి అందంగా బతుకమ్మను పేర్చారు. అనంతరం గ్రామ ప్రధాన కూడళ్ల వద్ద బతుకమ్మను నిలిపి పాటలు పాడుతూ ఆటలాడుతూ ఉత్సాహంగా వేడుకలు నిర్వహించుకున్నారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు.


రాయికల్ పోచమ్మవాడలో..

రాయికల్ పట్టణం: మండల కేంద్రంలోని పలు కాలనీల్లో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను మహిళలు బుధవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు కోలాట ఆటలతో అలరించారు.

ఘనంగా మహాత్మా వందన్ వేడుకలు

జగిత్యాల విద్యానగర్, న్యూస్‌టుడే: జగిత్యాల పట్టణ శివారులోని గాయత్రి విశ్వకర్మ వృద్ధాశ్రమంలో ఐఎంఏ పట్టణశాఖ ఆధ్వర్యంలో మహాత్మా వందన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఐఎంఏ పట్టణశాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ గూడూరి హేమంత్, డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి తదితరులు వైద్య శిబిరం నిర్వహించారు. వృద్ధులకు రక్త హీనత, డయాబెటీస్, బీపీ తదితర పరీక్షలు నిర్వహించారు. అనంతరం నిత్యావసరాలు, పండ్లు పంపిణీ చేశారు. ఐఎంఏ కోశాధికారి డాక్టర్ కోటగిరి సుధీర్, టీవీ సూర్యం, వృద్ధాశ్రమం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ విద్యార్థుల ఉపకార వేతనాలకు కొత్త మార్గదర్శకాలు

జగిత్యాల విద్యానగర్, న్యూస్‌టుడే: కళాశాలలకు చెందిన ఎస్సీ విద్యార్థుల ఉపకార వేతనాల మంజూరు కోసం ప్రభుత్వం నూతన మార్గదర్శకాలు ప్రకటించిందని షెడ్యూలు కులాల అభివృద్ధి అధికారి కె.రాజ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఇందులో డెమో అథెంటికేషన్, బయోమెట్రిక్ అథెంటికేషన్, రిజిస్ట్రేషన్ల పూర్తి తప్పనిసరని చెప్పారు. ఈపాస్ ద్వారా మూడు దశల నమోదు పూర్తి చేసిన దరఖాస్తులను కళాశాలల ప్రిన్సిపల్స్‌కు సమర్పించాలని పేర్కొన్నారు. నమోదు ప్రక్రియ సకాలంలో పూర్తి చేసేలా కళాశాలల యాజమాన్యాలు, నిర్వాహకులు చొరవ తీసుకోవాలని సూచించారు. వివరాల కోసం తమ కార్యాలయంలో సంప్రదించాలని చెప్పారు.

స్వచ్ఛత నిరంతరం కొనసాగాలి

జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే: స్వచ్ఛత కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. జగిత్యాలలోని 9వ వార్డు ధరూర్‌క్యాంపులో గల సావిత్రిబాయిపులే పార్కులో బుధవారం స్వచ్ఛతాహీసేవా కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణానికి వచ్చిన రూ. 50 లక్షల ఎఫ్‌డీఆర్ నిధులను పారదర్శకంగా కేటాయించాలని అధికారులకు సూచించారు. పురపాలక అధ్యక్షురాలు అడువాల జ్యోతి, కమిషనర్ సమ్మయ్య, కౌన్సిలర్ వొద్ది శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలి

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల గ్రామీణ మండలం నర్సింగాపూర్ శివారులో అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలని శాసనమండలి సభ్యుడు టి. జీవన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాశారు. అక్రమ మైనింగ్ రద్దు చేయాలని గత జూన్ 30న ఫిర్యాదు చేయగా కొద్దిరోజులు నిలిపివేసి తిరిగి కొనసాగిస్తున్నారని మైనింగ్ శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు.

హామీల అమలుకు 4న ధర్నా

జగిత్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: జగిత్యాలలో ఈ నెల 4న రైతులతో ర్యాలీ, కలెక్టరేట్ వద్ద భారీధర్నా తలపెట్టినట్లు రైతు ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. ఐక్యవేదిక నాయకులతో కలిసి జగిత్యాలలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. జగిత్యాల అర్బన్, రూరల్ మండలాల్లోని పలు గ్రామాల్లో రైతులతో సమావేశమై ధర్నాకు తరలి రావాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు నల్ల రమేశ్‌రెడ్డి, వేముల కర్ణాకర్‌రెడ్డి, బందెల మల్లయ్య, గడ్డం రాజిరెడ్డి, బద్దం మహేందర్‌రెడ్డి, సోమిరెడ్డి బుచ్చిరెడ్డి, బోదాసు మల్లేశ్, గడ్డం రాంరెడ్డి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

యువకుడి అదృశ్యం

వరదకాలువ వద్ద ద్విచక్ర వాహనం గుర్తింపు

కోరుట్ల, న్యూస్‌టుడే: కథలాపూర్ మండలం చింతకుంట గ్రామానికి చెందిన నేతుల మల్లేశం అనే యువకుడు అదృశ్యమైనట్లు ఎస్సై నవీన్‌కుమార్ బుధవారం రాత్రి తెలిపారు. యువకుడి ద్విచక్ర వాహనం దుంపేట గ్రామశివారులోని వరద కాలువ ఒడ్డున ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మల్లేశం వేగంగా వచ్చి వరద కాలువలో పడిపోయాడా లేదా ఇంకేమైనా జరిగిందా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, కోరుట్ల సీఐ సురేశ్‌బాబు పరిశీలించారు. అదృశ్యమైన యువకుడి సోదరుడు రాజమల్లయ్య ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మల్లేశం అదృశ్యంపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. చింతకుంటకు చెందిన ఇద్దరు వ్యక్తులను హత్య చేసేందుకు జగిత్యాలకు చెందిన సుఫారీ గ్యాంగ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఓ ఆడియో బయటకు రావడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. బుధవారం రాత్రి డీఎస్పీ, సీఐ, ఎస్సైలు ప్రత్యేకంగా సమావేశం కావడంతో సమస్య తీవ్రతను తెలుపుతోంది. దీనిపై సీఐ సురేశ్‌బాబును వివరణ కోరగా మల్లేశం అదృశ్యంపై ప్రత్యేక విచారణ చేపట్టామని, మృతదేహం లభ్యమైతే సహజ మరణమా లేదా హత్యానా అనేది తెలుతుందని పేర్కొన్నారు.

అత్తింటివారిపై కేసు

జగిత్యాల: జగిత్యాల లింగంపేటలో మంగళవారం రాపల్లి సౌమ్య ఉరివేసుకొని బలవన్మరణం చెందగా పట్టణ పోలీసులు అత్తింటివారిపై కేసు నమోదు చేశారు. అత్తింటి వేధింపులు భరించలేకనే బలవన్మరణానికి పాల్పడిందని సౌమ్య తల్లి సుంకరపల్లి లావణ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. పెళ్లి సమయంలో రూ. 5 లక్షల కట్నం ఇచ్చినప్పటికీ పిల్లలు పుట్టడం లేదని మరో రూ.5 లక్షల కట్నం కావాలని కొంతకాలంగా భర్త రాజేష్, అత్తామామలు వరలక్ష్మి, సుదర్శన్, ఆడబిడ్డ రోజా ఆమె భర్త శేఖర్ వేధిస్తున్నారని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు పట్టణ ఎస్సై మన్మదరావు తెలిపారు.

నెమలి కళేబరం గుర్తింపు

మల్యాల: మల్యాల శివారులోని గర్లకుంట సమీపంలో నెమలి కళేబరం గుర్తించారు. కుక్కలు దాడిచేయడంతోనే నెమలి చనిపోయిందని పలువురు గీతకార్మికులు తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

కొడిమ్యాల : కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన పురుషోత్తం శ్రీనివాస్ ప్రమాదవశాత్తు ఈత చెట్టుపై నుంచి జారి పడటంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు. . శ్రీనివాస్ బుధవారం సాయంత్రం కల్లు గీయడానికి ఈత చెట్టు ఎక్కుతున్న క్రమంలో పట్టు జారడంతో కిందపడిపోయాడు. దీంతో నడుముకు తీవ్రగాయమైంది. అంబులెన్స్‌లో జగిత్యాలకు తరలించినట్లు స్థానికులు పేర్కొన్నారు.

సంక్షిప్తం

చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలి

మెట్‌పల్లి: జిల్లా కేంద్రంలో ఈ నెల 4న తలపెట్టిన చలో కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని మున్నూరు కాపు నాయకులు ఒజ్జల శ్రీనివాస్, లైసెట్టి శంకర్, కోల రాజేందర్, నరేష్, గోల్కొండ పవన్, పిలుపునిచ్చారు. మెట్‌పల్లిలో బుధవారం మాట్లాడారు.

పండగ వేళ జాగ్రత్తలు పాటించాలి

మెట్‌పల్లి: దసరా సందర్భంగా ఇళ్లకు తాళాలు వేసి ఇతర ఊర్లకు వెళ్లే ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి సూచించారు. మెట్‌పల్లి పోలీస్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం మాట్లాడుతూ పండగ కోసం ఇతర గ్రామాలకు వెళ్లాల్సి వస్తే ఇంట్లో బంగారం, నగదు ఉంచవద్దన్నారు. బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవడం లేదంటే తమ వెంట తీసుకెళ్లాలని చెప్పారు. కాలనీల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై డయల్ 100 లేదా పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు.

కరపత్రాల ఆవిష్కరణ

మెట్‌పల్లి పట్టణం: వాసవి దేవాలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలను నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు రాంబాబు అన్నారు. బుధవారం పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో నవరాత్రుల కరపత్రాలను ఆవిష్కరించారు.

మాజీ మంత్రి విగ్రహ ఏర్పాట్ల పరిశీలన

కోరుట్ల: కోరుట్ల పట్టణ శివారులోని పశువైద్య కళాశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఈనెల 4న నిర్వహిస్తున్నారు. బుధవారం ఎస్పీ అశోక్‌కుమార్, కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జువ్వాడి నర్సింగరావు ఏర్పాట్లను పరిశీలించారు. డీఎస్పీ ఉమామహేశ్వరావు, సీఐ సురేశ్‌బాబు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ ఏర్పాటుకు స్థల..

మెట్‌పల్లి పట్టణం: పట్టణంలోని పాతబస్టాండ్ పురాతన బావి వద్ద ఆర్టీసీ బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని భాజపా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావుతో కలిసి భాజపా నాయకులు స్థలాన్ని పరిశీలించారు. సుఖేందర్‌గౌడ్, బొడ్ల రమేష్, యాదగిరిబాబు, నవీన్ పాల్గొన్నారు.

గ్రామసభ ఏర్పాటు చేయాలని వినతి

కొడిమ్యాల: పూడూర్ గ్రామపంచాయతీలో జరుగుతున్న అవకతవకలపై త్వరలోనే గ్రామసభ ఏర్పాటు చేయాలని కోరుతూ మాజీ ఎంపీపీ ముమ్మాడి రామస్వామి, సింగిల్‌విండో డైరెక్టర్ కడారి మల్లేశం బుధవారం ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు.

గ్రామ పంచాయతీ ఏర్పాటుకు..

రాయికల్: మండలంలోని చింతలూరు అనుబంధ గ్రామం బషీర్‌పల్లెను నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామస్థులు బుధవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రభాకర్, బాపురావు, రమేష్, తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

రాయికల్: రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామంలో ఇటీవల జ్వరంతో తాలుక గంగారెడ్డి కూతురు మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బుధవారం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పరామర్శించారు.

సంఘాలు-కార్యవర్గాలు

సారంగాపూర్: నర్సింహులపల్లెలో పద్మశాలి యువజన సంఘ కార్యవర్గ అధ్యక్షుడిగా బీమనాతి లవన్, గౌరవ అధ్యక్షుడిగా కడారి ప్రకాశ్, ప్రధాన కార్యదర్శిగా చింతల సురేష్, ఉపాధ్యక్షుడిగా ఎలగేటి సురేష్, కోశాధికారిగా అంకం కిశోర్, సంయుక్త కార్యదర్శిగా ప్రశాంత్‌ను ఎన్నుకున్నారు.

ఆటో డ్రైవర్లకు గొడుగుల పంపిణీ

రాయికల్ పట్టణం: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలువురు ఆటో డ్రైవర్లకు పట్టణంలోని గాంధీ చౌరస్తాలో బుధవారం గొడుగులు పంపిణీ చేశారు. అనంతరం గాంధీ జయంతిని పురస్కరించుకొని గాంధీ విగ్రహానికి పూల మాలలు సమర్పించి నివాళులు అర్పించారు. మచ్చ శేఖర్, కడకుంట్ల నరేష్, కట్ల నర్సయ్య, రమేష్, రాంరెడ్డి, గంగాధర్, ప్రసాద్ పాల్గొన్నారు.

లియాఫీ ఆవిర్భావ దినోత్సవం

జగిత్యాల వాణిజ్యం: ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం(లియాఫీ) ఆవిర్భావ దినోత్సవాన్ని జగిత్యాలలోని ప్రధాన కార్యాలయం ఎదుట బుధవారం నిర్వహించారు. బ్రాంచి మేనేజర్ బలరామకృష్ణ, సత్యనారాయణ రావు, వెంకటస్వామి, నాగరాజు, నర్సయ్య పాల్గొన్నారు.

ఉస్మానియా నుంచి డాక్టరేట్

జగిత్యాల ధరూర్‌క్యాంపు: జగిత్యాలకు చెందిన రచయిత, కవి గుండి శ్రీనివాస్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం సంస్కృతం విభాగం ద్వారా గౌరవ డాక్టరేట్ లభించింది. నృసింహ పురాణం ఏకమధ్యయనం అనే అంశంపై డాక్టర్ వి.సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తిచేసి పరిశోధన అంశాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఐజేయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు టి.వి.సూర్యం, కళాశ్రీ సాహితీ సంస్థ ప్రతినిధి గుండేటి రాజు తదితరులు శ్రీనివాస్‌ను బుధవారం సన్మానించారు.

ప్రయోగిల్లు సేవలు భేష్

మెట్‌పల్లి: ప్రయోగిల్లు ద్వారా విద్యార్థులు, యువత, మహిళల కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలు బాగున్నాయని మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి అన్నారు. మెట్‌పల్లి మండలం వెల్లుల్లలో ప్రయోగిల్లు మూడో వార్షికోత్సవం సందర్భంగా బుధవారం 2కె పరుగు నిర్వహించారు. ఖోఖో, వాలీబాల్, కబడ్డీ పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శ్రమదానం

మెట్‌పల్లి పట్టణం: గాంధీ జయంతిని పురస్కరించుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయసేవా పథకం ఆధ్వర్యంలో పరిసరాలను శుభ్రం చేశారు. ప్రిన్సిపల్ వెంకయ్య, అధ్యాపకులు అంజయ్య, శ్రీకాంత్, సత్తయ్య, లక్ష్మీనారాయణ, బాబు, లింగం పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ నిలిపివేతకు ఆదేశాలు

సారంగాపూర్: సారంగాపూర్ సహకార సంఘ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో వచ్చే వానాకాలం పంట నుంచి సేకరణ నిలిపివేయాలని సంఘానికి అధికారులు ఆదేశాలు జారీ చేశారు. నాగునూర్, లచ్చక్కపేట, వడ్డెరకాలనీ, రంగపేటలో ఉన్న కొనుగోలు కేంద్రాలలో సేకరణ చేపట్టకుండా మూసివేయాలని సూచించారు సారంగాపూర్ మండలంలోనే కాకుండా జిల్లాలో 5వేల క్వింటాళ్లలోపు సేకరించే దాదాపు 192 సహకార సంఘ పరిధిలోని కొనుగోలు కేంద్రాలన్నీ మూసివేస్తున్నారని సంఘ సీఈవో లైసెట్టి శివకుమార్ తెలిపారు.

పండగ వేళ.. మెరుగైన సేవలు

ఆర్టీసీలో ముందస్తు రిజర్వేషన్‌కు అవకాశం

న్యూస్‌టుడే, కరీంనగర్ రవాణా విభాగం

బతుకమ్మ, దసరా.. తెలంగాణలో ఎంతో ప్రాముఖ్యం గల పండగలు. వీటిని పురస్కరించుకొని ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేరవేసేందుకు కరీంనగర్ రీజియన్‌లో టీజీఎస్-ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంతోపాటు సంస్థకు ఆదాయాన్ని పెంచడం, ప్రయాణికుల రద్దీని తట్టుకొని మెరుగైన సేవలు అందించాలనే సంకల్పంతో ప్రత్యేక బస్సులను నడుపుతోంది. పండగల నేపథ్యంలో విద్య, ఉద్యోగ, వ్యాపార, వాణిజ్య అవసరాల నిమిత్తం ఎక్కడెక్కడో ఉన్నవారు సైతం స్వగ్రామాల బాట పడుతున్నారు. మరోవైపు ఈ నెల 2 నుంచి విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. దీంతో వివిధ బస్టాండ్లలో రద్దీ పెరిగే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో కరీంనగర్ రీజియన్ నుంచి టీజీఎస్-ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది.



కరీంనగర్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

రద్దీని తట్టుకోవడం సాధ్యమేనా?

■ ఇతర డిపోల బస్సులను తెప్పించడంతోపాటు కొత్తగా 33 ఎలక్ట్రిక్ సూపర్ లగ్జరీ బస్సులు కరీంనగర్-2 డిపోనకు అందుబాటులోకి రావడం ఉపశమనం కలిగించే అంశమని భావిస్తున్నారు.

■ ఆర్టీసీ బస్సుల్లో (పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్) మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన తర్వాత ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

■ మహాలక్ష్మి పథకానికి ముందు రోజు 1.50 నుంచి 2.50 లక్షల మంది ప్రయాణించగా ప్రస్తుతం ఆ సంఖ్య 4.50 లక్షలకు లక్షలకు చేరింది. ■ బతుకమ్మ, దసరాల సందర్భంగా ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ■ ఆక్యుపెన్సీ రేషియో కూడా 95 శాతానికి పైగా ఉంటోంది. కొన్ని సందర్భాల్లో వందశాతం దాటుతోంది.

డీఎంల పర్యవేక్షణ

ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. బస్టాండ్‌ను శుభ్రంగా ఉంచడంతోపాటు తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నారు. డిప్యూటీ ఆర్ఎంలు, రీజియన్‌లోని 11 డిపోల డీఎంలు, సూపర్‌వైజర్లు, ఇతర అధికారులు విడతల వారీగా జేబీఎస్ బస్టాండ్‌లో విధులు నిర్వహిస్తున్నారు. రద్దీకి అనుగుణంగా బస్సులు నడపేలా చర్యలు చేపడుతున్నారు. తిరుగు ప్రయాణంలో కరీంనగర్‌తోపాటు ఇతర బస్టాండ్లలో ఆయా డిపోల డీఎంలు ఉంటూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు 810 బస్సులు

దసరా సందర్భంగా రద్దీ దృష్ట్యా కరీంనగర్ రీజియన్‌కు సంబంధించి ఈ నెల 1 నుంచి 11 వరకు జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు 810 బస్సులు, అక్టోబరు 12 నుంచి 21 వరకు 850 అదనపు బస్సులు తిప్పాలని అధికారులు నిర్ణయించారు. వీటితోపాటు రోజువారీగా నడిపే బస్సులు ఆయా రూట్లలో నడపనున్నారు.

www.tsrtconline.in/ www.tgsrtcbus.in / oprs.web సందర్శించి ముందస్తు టికెట్ రిజర్వేషన్ చేసుకునే వీలు కల్పించారు.

బస్సుల్లో ప్రయాణించండి

ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేలా ఏర్పాట్లు చేశాం. రద్దీకి అనుగుణంగా బస్సులు తిప్పడానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం. ఆర్టీసీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

- సుచరిత, కరీంనగర్ రీజినల్ మేనేజర్

భళా.. బాలలు

జాతీయ స్థాయి స్కేటింగ్‌లో రాణింపు

న్యూస్‌టుడే, జ్యోతినగర్ (మార్కండేయకాలనీ)



పతకాలతో రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులు

స్కేటింగ్.. సరదా అనిపించే క్రీడ. అలా సరదాగా మొదలుపెట్టిన వారికి అదే జీవితమైంది. ఇందులో కొందరు చాలాసార్లు జాతీయస్థాయిలో ఎంపికయ్యారు. తమ ప్రతిభతో రామగుండం విద్యార్థులు ప్రశంసలు దక్కించుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. ఇటీవల ఎన్టీపీసీ పర్మినెంట్‌టౌన్‌షిప్‌లోని రోలర్ స్కేటింగ్ క్రీడా ప్రాంగణంలో జిల్లా స్థాయి ఛాంపియన్ షిప్‌లో ఉమ్మడి కరీంనగర్ నుంచి సుమారు వంద మంది పాల్గొన్నారు. ఇందులో 30 మంది క్రీడాకారులు ప్రతిభ కనబరిచి ఈనెల 4, 5వ తేదీల్లో భువనగిరిలో జరగబోయే రాష్ట్ర స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు. వీరిపై న్యూస్‌టుడే కథనం.

నాలుగుసార్లు జాతీయస్థాయిలో..



రోలర్ స్కేటింగ్ అంటే చాలా ఇష్టం. చిన్నప్పుడు సరదాగా అనిపించి ఇందులో శిక్షణ తీసుకున్నా. క్రమేపి ఆటపై ఆసక్తి పెరిగింది. నిత్యం సాధన చేస్తూ పలు పోటీల్లో పాల్గొంటున్నా. ఇప్పటివరకు నాలుగుసార్లు జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్‌లో పాల్గొని ప్రశంసపత్రాలు పొందాను. జిల్లా స్థాయి పోటీల్లో సుమారు ఎనిమిది సార్లు పాల్గొని బంగారు, వెండి పతకాలు సాధించా. ప్రస్తుతం భువనగిరిలో నిర్వహించే రాష్ట్ర స్థాయిలో పాల్గొని సత్తా చాటుతా. **- రావుల అక్షర, విద్యార్థిని**

శిక్షకుల సూచనలతో..



అయిదేళ్లుగా రోలర్ స్కేటింగ్‌లో శిక్షణ పొందుతున్నా. శిక్షకుల మార్గదర్శకత్వంలో మెలకువలు నేర్చుకుంటున్నా. ఇప్పటివరకు మూడుసార్లు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని 4వ, 5వ స్థానాల్లో నిలిచి ప్రశంసపత్రాలు పొందా. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎనిమిది సార్లు పాల్గొన్నా. నిత్య సాధనతోనే ప్రతి క్రీడల్లో విజయం సాధించవచ్చని నమ్ముతున్నా. **- ఎం.వర్షిత్ యాదవ్, విద్యార్థి**

ప్రథమ శ్రేణియే లక్ష్యంగా



పంజాబ్, తమిళనాడులో నిర్వహించిన జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో పాల్గొని ప్రశంసపత్రాలు పొందా. జాతీయస్థాయి పోటీల్లో ప్రథమ శ్రేణిలో నిలిచి బంగారు పతకం సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నా. చదువుతోపాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత కల్పిస్తూ ముందుకు వెళ్తున్నా. శిక్షకుల నుంచి సలహాలు తీసుకుంటేనే విజయం సొంతమవుతుందని నమ్ముతాను. **- మణికృష్ణ, విద్యార్థి**

పదహారేళ్లుగా శిక్షణ అందిస్తున్నా..



రోలర్ స్కేటింగ్‌లో గత పదహారేళ్లుగా విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నా. నిత్యం సాధన చేస్తే అనుకున్న లక్ష్యాన్ని అందిపుచ్చుకోవచ్చు. అన్ని క్రీడలతో పోలిస్తే వినూత్నంగా ఉంటుంది. ప్రతి విద్యార్థి క్రీడల్లో ఉన్నతంగా రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాలకు అవకాశముంటుంది. రోలర్ స్కేటింగ్‌ను ఒలింపిక్స్‌లో పాల్గొనే క్రీడాకారులు సైతం ఆడుతారు. **- కృష్ణమూర్తి, రోలర్ స్కేటింగ్ కార్యదర్శి**

స్వచ్ఛభారత్ దివస్‌కు కోరుట్ల పురపాలిక ఎంపిక

కోరుట్ల, న్యూస్‌టుడే: స్వచ్ఛభారత్ మిషన్ ప్రారంభమై 10 ఏళ్లు గడిచిన సందర్భంగా బుధవారం దిల్లీలో నిర్వహించిన స్వచ్ఛభారత్ దివస్ కార్యక్రమానికి కోరుట్ల పురపాలక సంఘం ఎంపికైంది. కోరుట్ల పురపాలిక తరఫున ఛైర్‌పర్సన్ అన్నం లావణ్య, కమిషనర్ బట్టు తిరుపతి హాజరయ్యారు. తెలంగాణ నుంచి కల్వకుర్తి, సిద్దిపేట, కోరుట్ల, వరంగల్ ఎంపికయ్యాయి.



దిల్లీలో జరిగిన సభకు హాజరైన కోరుట్ల మున్సిపల్ ఛైర్‌పర్సన్ అన్నం లావణ్య

నకిలీ నోట్ల ముఠా అరెస్టు



కోరుట్లలో పోలీసులు పట్టుకున్న నకిలీ రూ.500 నోట్లు

కోరుట్ల, న్యూస్‌టుడే: కోరుట్ల పట్టణంలో నకిలీ నోట్లు చెలామణి చేస్తున్న ముఠాను పట్టుకున్నట్లు డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు. బుధవారం కోరుట్ల పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. సెప్టెంబర్ 28న పట్టణంలోని వేములవాడరోడ్డులో కొబ్బరిబోండాల విక్రయ దుకాణం వద్దకు ఓ వ్యక్తి వచ్చి కొబ్బరి నీళ్లు తాగి రూ.500 నోట్ ఇచ్చి చిల్లర తీసుకొని వెళ్లాడు. తర్వాత డబ్బులు లెక్కిస్తుండగా రూ.500 నోట్ తేడాగా ఉండటంతో లింగం పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేశారు. నిందితులను పట్టుకునేందుకు సీఐ సురేశ్‌బాబు ఆధ్వర్యంలో రెండు బృందాలు ఏర్పాటై గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం తిలక్‌రోడ్డులో ఓ ఇంట్లో కొందరు వ్యక్తులు నకిలీ నోట్లు సరఫరా చేసేందుకు సమావేశమయ్యారని సమాచారం రావడంతో సీఐ, ఎస్సై శ్రీకాంత్ సిబ్బందితో వెళ్లి అయిదుగురు వ్యక్తులను పట్టుకున్నారు. ఇందులో ఓ వ్యక్తి రాజస్థాన్ నుంచి రూ.2 లక్షల నకిలీ రూ.500 నోట్లను తీసుకొచ్చి ఇక్కడి నలుగురు వ్యక్తులతో చెలామణి చేయించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో ఓ వ్యక్తి కొబ్బరి బోండాలు అమ్మే వ్యక్తికి, మరోవ్యక్తి రొట్టెలు అమ్మే వ్యక్తికి రూ.500 నోట్లను ఇచ్చినట్లు ఒప్పుకొన్నారు. అయిదుగురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద రూ.1,61,000ల విలువ గల రూ.500 నోట్లు, అయిదు చరవాణులను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. సీఐ, ఎస్సై, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించినట్లు పేర్కొన్నారు.

బతుకమ్మ ఆడుతూ మహిళ హఠాన్మరణం



స్వరూప

ముత్తారం: ముత్తారం మండలం లక్కారంలో బుధవారం బతుకమ్మ వేడుకల్లో విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మాదాసి స్వరూప(45) సాయంత్రం బతుకమ్మ ఆడుతూ కుప్పకూలింది. స్థానికులు గమనించి చూసేసరికే మృతి చెందింది. స్వరూప మెదడుకు సంబంధించిన వ్యాధితో బాధ పడుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. మృతురాలి భర్త పదేళ్ల కిందటే మృతి చెందగా ఇద్దరు కూతుళ్లకు పెళ్లిళ్లయ్యాయి. పండుగ రోజు మహిళ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

పెళ్లి కావడం లేదని ఎక్సైజ్ కానిస్టేబుల్ ఆత్మహత్య



దేవేందర్‌రెడ్డి

వీణవంక, న్యూస్‌టుడే : కరీంనగర్ జిల్లా వీణవంక మండలం ఎలబాక గ్రామానికి చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ బొల్లం దేవేందర్‌రెడ్డి (27) పెళ్లి కాదేమోనన్న మనస్తాపంతో బలవన్మరణానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. వీణవంక ఎస్సై తోట తిరుపతి కథనం ప్రకారం.. దేవేందర్‌రెడ్డికి ఇటీవల ఎక్సైజ్ కానిస్టేబుల్ ఉద్యోగం రాగా, నాలుగు నెలల నుంచి హుజూరాబాద్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్నారు. ఈ నెల 1న మంగళవారం రాత్రి ఇంటి వద్ద పురుగు మందు తాగగా బంధువులు కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందారు. తన కుమారుడికి పెళ్లి సంబంధాలు చూస్తున్నా కుదరడం లేదని.. దీంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు దేవేందర్‌రెడ్డి తండ్రి సంపత్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వైకల్యాన్ని జయించి మూడు ఉద్యోగాలకు ఎంపిక



మధు

జగిత్యాల, న్యూస్‌టుడే: ఓ వైపు పేదరికం.. మరోవైపు అంగవైకల్యం అయినప్పటికీ లక్ష్యం కోసం వెనుతిరిగి చూడకుండా మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. జగిత్యాల టాకావీధికి చెందిన అనుమల్ల మధు తండ్రి సత్యనారాయణతో పాటు ఓ వస్త్ర దుకాణంలో సేల్స్‌మెన్‌గా పనిచేసేవారు. గతంలో రహదారి ప్రమాదం జరగగా ఎడమకాలు మోకీలు వరకు తొలగించారు. ఆర్థిక ఇబ్బందులకు తోడు అంగవైకల్యం వెక్కిరిస్తున్నా పదో తరగతి చదివి ఆపేసి వస్త్ర దుకాణంలో పనిచేస్తూనే దూరవిద్య ద్వారా బీఏ, ఎంఏ, బీఈడీ పూర్తి చేశాడు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతుండగా మొదటి ప్రయత్నంలో రెండు నెలల కిందట గురుకుల పాఠశాల ఉపాధ్యాయుడిగా ఎంపికై నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో పనిచేస్తున్నాడు. గతనెలలో వసతి గృహ సంక్షేమాధికారి ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 5వ ర్యాంకు రాగా జోనల్‌స్థాయిలో మొదటి స్థానంలో నిలిచాడు. తాజాగా డీఎస్సీ ఫలితాలు ప్రకటించగా స్పెషల్ ఎడ్యుకేషన్ విభాగంలో జిల్లా స్థాయిలో మొదటిర్యాంకు సాధించాడు. గురువారం ధ్రువపత్రాలు పరిశీలించనున్నారు.

ఎస్సారెస్పీ నుంచి మధ్యమానేరుకు 12 వేల క్యూసెక్కులు

జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ జలాశయం నుంచి బుధవారం సాయంత్రం వరకు వరదకాలువకు 12 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తూ మధ్యమానేరు జలాశయానికి తరలిస్తున్నారు. ఎస్సారెస్పీలోకి ప్రస్తుతం 17,860 క్యూసెక్కుల వరద వస్తుండగా స్పిల్‌వే గేట్లను మూసివేశారు. ప్రాజెక్టులో గరిష్ఠస్థాయిలో నీటినిల్వ 80.501 టీఎంసీలుగా ఉంది.

భత్యమివ్వండి.. బతకనివ్వండి

ప్రభుత్వ సాయానికి దివ్యాంగుడి ఎదురుచూపు

ఈనాడు, పెద్దపల్లి

తీవ్ర అనారోగ్యంతో ఆ యువకుడు మంచానికే పరిమితమయ్యారు.. ప్రభుత్వం అందించే పింఛను వైద్యం ఖర్చులకే సరిపోవడం లేదు.. చట్టం ప్రకారం అందాల్సిన సంరక్షకుడి భత్యం ఇవ్వాలని, లేకుంటే కారుణ్య మరణానికి అనుమతించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు..

పెద్దపల్లి జిల్లా మంథని మండలం బెస్తపల్లికి చెందిన తోకల మహేశ్‌కుమార్ వయసు 36 ఏళ్లు. చిన్నతనంలోనే తండ్రి చనిపోయారు. డిగ్రీ పూర్తి చేసిన మహేశ్ 15 ఏళ్ల కిందట జన్యుపరమైన కండరాల క్షీణత(మస్క్యులర్ డిస్ట్రోఫీ) వ్యాధి బారిన పడ్డారు. అప్పటి నుంచి ఆరోగ్యం క్రమంగా క్షీణిస్తోంది. ప్రభుత్వం అతడికి ఇచ్చే దివ్యాంగుల పింఛను రూ.4,016, తల్లికి వచ్చే వితంతు పింఛను రూ.2,016 మాత్రమే జీవనాధారం. ఆ మొత్తం వైద్య ఖర్చులకూ సరిపోవడం లేదు. కండరాలన్నీ చచ్చుబడి మంచానికే పరిమితం కావడంతో వృద్ధురాలైన తల్లి మల్లమ్మనే అన్ని పనులూ చేస్తున్నారు. ఆమె తరచూ అనారోగ్యం బారిన పడుతుండటంతో తనకు 'కారుణ్య మరణం' ప్రసాదించాలంటూ మహేశ్ ఈ ఏడాది జనవరి 18న మానవ హక్కుల కమిషన్‌కు లేఖ రాశారు. ఇప్పటివరకు స్పందన లేకపోవడంతో దివ్యాంగుల హక్కుల చట్టం(ఆర్‌పీడబ్ల్యూడీ) 2016 ప్రకారం తనకు సంరక్షకుడి భత్యం(కేర్ టేకర్ అలవెన్స్) మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అలా ఇవ్వని పక్షంలో కారుణ్య మరణమైనా ప్రసాదించాలని విన్నవిస్తున్నారు.

ఈనాడు కథనాలతో గూడు

కాళేశ్వరం ప్రాజెక్టులోని పార్వతీ(సుందిళ్ల) బ్యారేజీ వెనుక జలాల్లో బెస్తపల్లి గ్రామం ముంపునకు గురైంది. మహేశ్ దుస్థితిపై పలుమార్లు 'ఈనాడు'లో కథనాలు రావడంతో అధికారులు స్పందించి మంథని పోచమ్మవాడలోని రెండు పడక గదుల గృహ సముదాయంలో ఇంటిని కేటాయించారు. ఆ తర్వాత జీవనోపాధికి సాయం అందించాలంటూ పలుమార్లు కలెక్టరేట్‌లోని 'ప్రజావాణి'ని ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. తనలాగా రాష్ట్రవ్యాప్తంగా 2 వేల మంది కండర క్షీణత వ్యాధితో బాధ పడుతున్నందున ప్రభుత్వం అండగా నిలవాలని మహేశ్‌కుమార్ కోరుతున్నారు. పింఛను మొత్తాన్ని పెంచాలని, సంరక్షకుడి భత్యాన్ని మంజూరు చేయాలని వేడుకుంటున్నారు. ఈ విషయమై కలెక్టర్ కోయ శ్రీహర్షను 'ఈనాడు' సంప్రదించగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



తల్లితో కలిసి కలెక్టరేట్ ప్రజావాణికి వచ్చిన మహేశ్ (పాతచిత్రం)

హక్కులపై అన్నదాత ఆశలు

సాదాబైనామా కింద 1.12 లక్షల దరఖాస్తులు ■ ఆర్వోఆర్ చట్టంతో తొలగనున్న ఇబ్బందులు

ధరణి పోర్టల్‌లోని సాంకేతిక సమస్యలతో పాటు సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారానికి మోక్షం లభించనుంది. ఆర్వోఆర్ చట్టాన్ని అందుబాటులోకి తీసుకొచ్చి రైతులకు హక్కులకు కల్పించేందుకు ప్రభుత్వం కొత్త రెవెన్యూ చట్టాన్ని సిద్ధం చేస్తోంది. పెండింగ్ భూ సమస్యలతో పాటు తెల్ల కాగితంపై రాసుకున్న దస్త్రాలకు పట్టా హక్కులు కల్పించనుంది. కొన్నేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతులకు భూ యాజమాన్య హక్కుల కష్టాలు దూరం కానున్నాయి. – న్యూస్‌టుడే, పెద్దపల్లి



పెద్దపల్లి కలెక్టరేట్‌లోని ధరణి విభాగంలో ఫిర్యాదు చేస్తున్న రైతులు

మూడేళ్ల కిందట స్వీకరణ

తెల్ల కాగితంపై క్రయ విక్రయాలు సాగించిన భూములకు గత ప్రభుత్వం 2021లో మీసేవ ద్వారా సాదాబైనామాలో దరఖాస్తులు ఆహ్వానించగా ఉమ్మడి జిల్లాలో 1,12,517 మంది చేసుకున్నారు. తెల్లకాగితంపై రాసుకున్న భూ క్రయ విక్రయాలకు చట్టబద్ధత కల్పించడానికి రిజిస్ట్రేషన్లు చేసి పట్టా పాసుపుస్తకాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాత రెవెన్యూ చట్టం రద్దయ్యాక దాని ఆధారంగా చేపట్టే సాదాబైనామాల క్రమబద్ధీకరణ ప్రక్రియను నిలిపివేయాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది.

ఉమ్మడి జిల్లాలో దరఖాస్తులు

పెద్దపల్లి:	35,580
రాజన్న సిరిసిల్ల:	15,056
కరీంనగర్:	26,871
జగిత్యాల:	35,010

పథకాలకు దూరం

గతంలో తెల్ల కాగితాలపై రాసుకొని కొనుగోలు చేసిన భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు లేకపోవడంతో రైతులు వివిధ అవసరాలకు ఇబ్బందులు పడుతున్నారు. రైతుబంధు, రైతు బీమా, కిసాన్ సమ్మాన్ నిధి, పంట రుణం, ఇతర సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. కళ్ల ముందే భూమి ఉన్నా పట్టా హక్కులు లేకపోవడంతో ఏమీ చేయలేని పరిస్థితి. మరోవైపు ధరణి పోర్టల్‌లో అమ్మిన రైతుల పేర్లే కనిపించడంతో కొనుగోలుదారులకు కొత్త చిక్కులు ఎదురవుతున్నాయి. భూములు విక్రయించిన వారసులు ఎదురు తిరుగుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించడం తలనొప్పిగా మారింది.

ఆ నిబంధన తొలగిస్తేనే ప్రయోజనం

కొత్త చట్టం సాదాబైనామాలకు అవకాశం కల్పించడంతో అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గతంలో మాదిరిగానే నిర్దేశిత రుసుం లేకుండా పట్టాదారు పాసు పుస్తకాలను జారీ చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 'భూ యజమానుల వారసుల అంగీకారం' అనే నిబంధనను తొలగించాలని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు. ఆ నిబంధన అమలు చేస్తే సాదాబైనామాల వల్ల కలిగే ప్రయోజనం అంతంతమాత్రమేనని విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులు పేర్కొంటున్నారు.

పరిచయస్థురాలే కాజేసింది

బంగారం చోరీ కేసు ఛేదించిన పోలీసులు



నిందితుల అరెస్టు చూపుతున్న ఏసీపీలు నరేందర్, కాశయ్య

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే: తనకు పరిచయం ఉన్న వివాహిత ఒంటిపై కనిపించిన బంగారు ఆభరణలపై కన్నేసింది. ఎలాగైనా వాటిని దక్కించుకోవాలని పన్నాగం పన్నింది. బంధువుతో కలిసి చోరీకి పాల్పడి చివరకు పోలీసులకు చిక్కింది. కరీంనగర్ నగర ఏసీపీ జి.నరేందర్ బుధవారం వెల్లడించిన వివరాల ప్రకారం.. పిట్టల ప్రశాంత్ (గ్రానైట్ వ్యాపారి), భార్య లహరి (గృహిణి)లు కరీంనగర్ ప్రగతినగర్‌లో ఉంటున్నారు. సెప్టెంబర్ 24 మధ్యాహ్నం లహరి బయటకు వెళ్లి రాగా ఇంటికి మరోవైపు ఉన్న తలుపు తీసి ఉంది. బీరువాలోని 187 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఏసీపీ నరేందర్, సీఐ విజయ్‌కుమార్‌లు కేసు దర్యాప్తు చేపట్టారు. సీసీఎస్, రెండో ఠాణా పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను గుర్తించారు. బాధితురాలు లహరి, నిందితురాలు త్రిపురాని లహరి అలియాస్ శిరీష గతంలో రాంనగర్‌లో పక్కపక్కనే అద్దెకు ఉన్నారు. లహరి మరో ఇల్లు మారినా.. శిరీష వెళ్లి పలకరిస్తుండేది. గణేశ్ నవరాత్రుల సందర్భంగా లహరి ఒంటిపై బంగారు ఆభరణాలను గమనించిన శిరీష.. ఎలాగైనా వాటిని దక్కించుకోవాలనుకుంది. చోరీ జరిగే ముందు రోజు లహరి ఇంటికి వెళ్లి ప్రధాన ద్వారం కాకుండా పక్కన ఉండే మరో ద్వారం బేడం తీసి వచ్చింది. ఎప్పుడు ఆ ద్వారంను ఉపయోగించకపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు దృష్టి సారించలేకపోయారు. 24న ఇంట్లో ఎవరూ లేని సమయంలో శిరీష మంచిర్యాల జిల్లా భీమారం మండలం ఖాజీపూర్‌కు చెందిన తన మేనబావ చిలుకాని రాజశేఖర్‌తో కలిసి ఇంట్లోకి చొరబడి బంగారాన్ని అపహరించింది. సీసీ కెమెరాల ద్వారా నిందితులను గుర్తించిన పోలీసులు వారిని కరీంనగర్ తెలంగాణచౌక్ వద్ద పట్టుకున్నారు. 187 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకొని ఇద్దరినీ జైలుకు పంపించినట్లు ఏసీపీ తెలిపారు. సీసీఎస్ ఏసీపీ కాశయ్య ఉన్నారు.

క్షణికావేశం అన్న ప్రాణం తీసింది!

■ కుమారుడిని చంపుతాననడంతో తమ్ముడి దాడి?
■ అంతర్గాం హత్యోదంతంపై పోలీసులకు స్పష్టత

జగిత్యాల గ్రామీణం, న్యూస్‌టుడే : జగిత్యాల మండలం అంతర్గాంలో మంగళవారం రాత్రి హత్యకు గురైన విద్యాసాగర్‌రాజు కేసులో పోలీసులు పురోగతి సాధించినట్లు తెలిసింది. మృతుడి సోదరుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా తన కుమారుడిని చంపుతానని బెదిరించడంతో క్షణికావేశంలో హత్య చేసినట్లు ఒప్పుకొన్నట్లు సమాచారం.. విశ్వసనీయ సమాచారం మేరకు.. అంతర్గాంకు చెందిన నన్నపనేని రమేశ్‌రాజు దంపతులకు విద్యాసాగర్‌రాజు, విక్రమ్‌రాజు ఇద్దరు కుమారులు. వీరిది ఉమ్మడి కుటుంబం కాగా పెద్ద కుమారుడు పదేళ్ల కిందట దుబాయికి వెళ్లాడు. అక్కడ మద్యానికి బానిసై అప్పులు చేయగా అతడికి రూ.5 లక్షలు పంపించడంతోపాటు భూమి అమ్మి మరో రూ.20 లక్షలకుపైగా అప్పులు చెల్లించారు. మూడేళ్ల కిందట స్వగ్రామానికి వచ్చిన విద్యాసాగర్‌రాజును కుటుంబ సభ్యులు పెళ్లి చేసుకోవాలని సూచించినా నిరాకరించాడు. విక్రమ్‌రాజుకు వివాహం కాగా ఒక బాబు జన్మించాడు. విద్యాసాగర్‌రాజు మద్యానికి బానిసై నిత్యం డబ్బుల కోసం తండ్రిని అడగటం ఇవ్వకపోతే చంపుతానని బెదిరించటం అలవాటు చేసుకున్నాడు. ఈ క్రమంలో ఆదివారం తల్లిదండ్రులపై దాడి చేసి చంపుతానని బెదిరించటంతో వారు ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. మంగళవారం సాయంత్రం ఇంట్లో ఒంటరిగా ఉన్న తమ్ముడితో అన్న గొడవకు దిగాడు. అమ్మానాన్నను ఎక్కడ దాచావంటూ బెదిరించాడు. భూమి అమ్మి డబ్బులు ఇవ్వాలని బెదిరించి తీవ్ర వాగ్వాదానికి దిగాడు. తమ్ముడిని, అతడి కుమారుడిని కూడా చంపుతానని బెదిరించాడు. దీంతో విక్రమ్‌రాజు విద్యాసాగర్‌రాజు తలపై రోకలి బండతో కొట్టడంతో మృతి చెందినట్లు పోలీసుల విచారణలో వెల్లడించినట్లు తెలిసింది. కుమారుడి హత్య గురించి తెలుసుకుని తల్లిదండ్రులు బుధవారం ఇంటికి చేరారు. కేసును జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, సీఐ కృష్ణారెడ్డి, ఎస్సై సదాకర్ దర్యాప్తు చేస్తున్నారు. సీఐ కృష్ణారెడ్డిని హత్య కేసు విషయమై వివరణ కోరగా గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తామన్నారు.

నవోదయలో ప్రవేశానికి గడువు పొడిగింపు

చొప్పదండి : నవోదయ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తు గడువు ఈ నెల 7 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు ప్రిన్సిపల్ మంగతాయారు ఓ ప్రకటనలో తెలిపారు. 8, 9 తేదీల్లో దరఖాస్తుల్లోని పొరపాట్లు సవరించుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.